Published From Telangana, andhrapradesh

PRGI No.TELTEL/2010/33275

ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily

epaper.prajakalam.in, www.prajakalam.in

జాతీయ దిన పత్రిక

గురువారం | 22-10-2026 | సంపుటి :17, సంచిక : 201, నిజామాబాద్, పేజీలు : 8, వెల : 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

మద్యం అమ్మకాల్లో
తెలంగాణ రికార్డు !
దసరా వేళ ఎక్సైజ్ శాఖ ఖజానకు కిక్కు!

అక్టోబర్‌లో ఇప్పటికే రూ.2,055 కోట్లు..	నాలుగు రోజుల్లోనే రూ.755 కోట్ల విక్రయాలు	గత ఏడాదితో పోలిస్తే రూ.57 కోట్లకు పైగా పెరుగుదల



హైదరాబాద్, అక్టోబర్ 21 (ప్రజా కలం): దసరా పండుగ వేళ తెలంగాణలో మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. పండుగకు ముందు నాలుగు రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా రూ.755.14 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. గత ఏడాది ఇదే సమయంలో రూ.698 కోట్ల అమ్మకాలు జరగ్గా.. ఈసారి మరో రూ.57.14 కోట్ల మేర విక్రయాలు పెరిగాయి.

మిగతా 2లో...

సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోశ్‌లకు
ఊరట
ఇరువురి నేతల విడుదలకు హైకోర్టు ఆదేశం



ఈసీ స్వాతంత్ర్యాన్ని దెబ్బతీస్తున్న
మోడీ ప్రభుత్వం
కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్



దేశ రాజధానిలో
మళ్లీ వాయు కాలుష్యం

- అమల్లోకి వచ్చిన గ్రాఫ్ స్టేజ్1 ఆంక్షలు
- వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ ప్రకటన





అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి
పెద్దపీట
2028 నాటికి పోలీసు శాఖలో ఖాళీలన్నీ భర్తీ!

ప్రజా కలం, హైదరాబాద్ : రాష్ట్ర పోలీసు శాఖలో సిబ్బంది కొరతను పూర్తిగా నివారించేందుకు 2028 నాటికి అన్ని ఖాళీలను విడతలవారీగా భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని స్పష్టం చేశారు. పోలీసు అమరవీరుల త్యాగాలను గౌరవిస్తూ, వారి ఆశయాలకు అనుగుణంగా శాంతియుతమైన, సురక్షితమైన, అభివృద్ధి చెందిన తెలంగాణను నిర్మించుకుందామని పిలుపునిచ్చారు.

హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో సీఎం పాల్గొని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం పోలీసు శాఖ బలోపేతం, సిబ్బంది సంక్షేమం, అమరుల కుటుంబాలకు..

మిగతా 2లో...

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన
కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ అధికారి వరకు పరిహారం భారీగా పెంపు
హోంగార్డుల ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంపునకు ఆదేశం
అమరుల కుటుంబాలకు భారీ పరిహారం..
పోలీసు అమరవీరులకు ఘన నివాళులు

అంబర్‌పేట్ తాసిల్దార్ కార్యాలయంలో
సిసి కెమెరాలకు సుస్తి
నిఘా నేత్రాలకు మరమతులు చేయరా..?

కార్యాలయ భద్రత గాలికి.. అడుగడుగునా అధికారుల డొల్లతనం

సిసి కెమెరాలు పనిచేయకపోవడంతో రెచ్చిపోతున్న బ్రోకర్లు..!

- ఎందుకు మరమ్మతులు చేయడంలేదు...?
- జరగరానిది ఏమైనా జరిగితే బాధ్యత ఎవరిది...?
- గతంలో జరిగిన సంఘటనలు మర్చిపోయారా..?



ప్రభుత్వ అధికారి టేబుల్ పై ఫైల్స్ చెక్ చేస్తున్నబ్రోకర్

హైదరాబాద్ అక్టోబర్ 21(ప్రజాకలం ప్రతినిధి) : అంబర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో సిసి కెమెరాలు పనిచేయకపోవడం అనేది ప్రజల భద్రతను,కార్యాలయ పారదర్శకతను తీవ్రంగా దెబ్బతీసే అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్య.ప్రభుత్వ కార్యాలయాలలో, ముఖ్యంగా భూగర్భ రికార్డులు, రిజిస్ట్రేషన్లు,అత్యంత కీలకమైన ప్రజా సమస్యలతో ముడిపడి ఉండే రెవెన్యూ కార్యాలయంలో నిఘా నేత్రాలు మొరాయించడం,భద్రత గాలికి వదిలివేయడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అక్రమాలు బయటపడతాయనే భయమా?

సాధారణంగా సీసీ కెమెరాలు ఆగిపోయిన ప్పుడు ప్రజల్లో వచ్చే మొదటి అనుమానం ఇదే. కార్యాలయంలో జరిగే అవినీతి, లంచగొండితనం,లేదా దళారుల రౌడీ మూకల లేదా మధ్య వర్తుల కదలికలు రికార్డు కాకూడదనే ఉద్దేశంతో కొందరు కావాలనే వీటికి మరమ్మతులు చేయించకుండా నిర్లక్ష్యం...

మిగతా 2లో...

మైసూరు దసరా వేడుకల్లో
సీఎం రేవంత్‌రెడ్డి
జంబూ సవారిని వీక్షించి.. చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

02

నేడు కొడంగల్‌లో
సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
పటిష్ట పోలీసు బందోబస్తు

టీఎంసీ ఎమ్మెల్యేల
మద్దతు మాకే..

- బెంగాల్ సీఎం సువేందు సంచలన వ్యాఖ్యలు
- బలపరీక్ష పెడితే తమకు 275 మంది ఎమ్మెల్యేల మద్దతు
- టీఎంసీ నుంచి గెలిచిన 64 మంది ఎమ్మెల్యేలు బీజేపీకి మద్దతిస్తారని ధీమా



రెండు రోజుల్లో
బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన
సీఎం రేవంత్ వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధం
నవంబర్ 1న హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పాదయాత్ర
జిల్లాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపడతాం..
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 21(ప్రజా కలం): ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు తుదిదశకు చేరింది. మరో రెండు, మూడు రోజుల్లో అభ్యర్థులను ప్రకటిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు తెలిపారు. ఈ నెల 24న పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి సునీల్ బన్సల్ తెలంగాణకు రానున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ నిర్ణయించినట్లు రామచందర్‌రావు తెలిపారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అన్ని జిల్లాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.



నవంబర్ 1న పాదయాత్ర..

కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకంగా నవంబర్ 1న హైదరాబాద్‌లో భారీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు రామచందర్‌రావు వెల్లడించారు. ఇదే తరహాలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ పాదయాత్రలు, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొనేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు.

అధిష్ఠానిదే తుది నిర్ణయం..

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని రామచందర్‌రావు స్పష్టం చేశారు. నల్లగొండ-ఖమ్మం-వరంగల్

మిగతా 2లో...



ఆర్టీసీ గుర్తింపు సంఘంగా
ఈయూ ఘన విజయం!
18,276 ఓట్లతో రాష్ట్రస్థాయి గుర్తింపు
రెండో స్థానంలో వర్కర్స్ యూనియన్..
అధికారిక ఉత్తర్వులు జారీ

02

ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి తలెత్తకుండా
ముందస్తు చర్యలు
ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టాలి.. తాగునీటికి ప్రథమ ప్రాధాన్యం
రామప్ప చెరువులో 29 అడుగుల నీటి నిల్వ.. పంపింగ్ ద్వారా నీటి సరఫరాకు చర్యలు
ఉపాధి హామీ పనులతో నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టాలి
అధికారులతో సమీక్షల ద్వారా తాగునీటి కొరత లేకుండా చూస్తాం: మంత్రి సీతక్క

ప్రజా కలం, ములుగు :

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరిగి, వర్షాలు తగ్గుతున్న నేపథ్యంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో గత ఆరు నెలలుగా వివిధ శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ నీటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ములుగు జిల్లా వెంకటాపురం మండలం పరిధిలోని రామప్ప చెరువు, అక్కడి డీఫ్లోరైడేషన్ ప్రాజెక్టును మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామప్ప చెరువులో ప్రస్తుతం 29 అడుగుల మేర నీరు అందుబాటులో ఉందని తెలిపారు. గోదావరి నుంచి నీటిని పంపింగ్ చేసి చెరువులు, పరిసర ప్రాంతాలకు నీటి సరఫరా మెరుగుపరిచే అవకాశాలను పరిశీలిస్తున్నామని వెల్లడించారు. నీటి నిల్వలు పెరిగేందుకు ఏటా ఇచ్చే విరామాన్ని దృష్టిలో ఉంచుకుని, మరో రెండు రోజుల్లో నీటిని విడుదల చేసేలా సంబంధిత అధికారులను కోరినట్లు చెప్పారు.

రామప్ప నుంచి నీటిని డీఫ్లోరైడేషన్ ప్రాజెక్టు ద్వారా శుద్ధి చేసి ములుగు, వెంకటాపురం, గోవిందరావుపేట, మల్లంపల్లి పరిసర ప్రాంతాలతో పాటు భూపాలపల్లి జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నీటి సరఫరా వ్యవస్థలు, చెరువులపై ఆధారపడిన గ్రామాలు, భూగర్భ జలాల పరిస్థితిని అధికారులు నిరంతరం పరిశీలిస్తున్నారని తెలిపారు.

ప్రకృతి వైపరీత్యాలపై రాజకీయాలు తగవు..

అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి పరిణామాలను ఏ శక్తీ పూర్తిగా నియంత్రించలేదని, ఇలాంటి పరిస్థితులను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదని మంత్రి సీతక్క అన్నారు. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఉష్ణోగ్రతల్లో వస్తున్న మార్పులు వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ప్రకృతి సవాళ్లను ఎదుర్కొనేందుకు రాజకీయ విమర్శల కంటే సమష్టి కార్యాచరణ అవసరమని స్పష్టం చేశారు.



ఉపాధి హామీతో నీటి సంరక్షణకు పెద్దపీట..

వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతలు, ఊటకుంటలు, నీటి కుంటలు, చెక్‌డ్యామ్‌లు, చెరువుల పునరుద్ధరణతో పాటు బోర్ల రీచార్జ్ పనులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద విస్తృతంగా..

మిగతా 2లో...

కలం కౌంటర్





దసరా పండుగను సొంతూళ్లలో జరుపుకుని తిరుగు ప్రయాణమైన ప్రయాణికులతో జాతీయ రహదారులు కిక్కిరిసిపోయాయి. దీంతో వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగుతున్నాయి. రహదారి విస్తరణ పనులు, ఫ్లై ఓవర్ పనులు సాగుతున్న హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ భారీగా పెరిగింది. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ వద్ద వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. చౌటుప్పల్‌లో ఫ్లై ఓవర్ల నిర్మాణం వల్ల వాహనాల వేగం తగ్గించాల్సి వస్తోంది. రద్దీ పెరిగిపోయి కిలోమీటర్ల నుంచి వాహనాలు ఆగిపోయాయి. చౌటుప్పల్ పట్టణాన్ని దాటేందుకు 45 నిమిషాలకు పైగా సమయం పడుతోంది. అర్ధరాత్రికి ఈ సమయం మరింత పెరిగే అవకాశం ఉంది.

- ప్రజా కలం, చౌటుప్పల్

ప్రజా కలం

నేడు కొడంగల్‌లో

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

- ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత
- హెలిప్యాడ్, పర్యటన ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్ల పరిశీలన
- ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు ప్రణాళిక
- వైద్య సేవల కోసం అంబులెన్స్‌లు సిద్ధం
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దీపక్ తివారి సూచన
- పోలీసు సిబ్బందికి ప్రత్యేక విధులపై ఎస్పీ స్నేహ మెహ్రా అవగాహన
- హెలిప్యాడ్, పర్యటన ప్రాంతాల్లో తనిఖీలు



ప్రజా కలం, వికారాబాద్ :

ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఈ నెల 22న కొడంగల్ పర్యటనకు రానున్న నేపథ్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
పర్యటన నేపథ్యంలో కొడంగల్‌లోని హెలిప్యాడ్, ఇతర ప్రాంతాలను ఎస్పీ పరిశీలించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఇంటెలిజెన్స్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌తో కలిసి ముందస్తు భద్రతా సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై చర్చించారు.
పర్యటన మార్గాలు, హెలిప్యాడ్, సభా ప్రాంగణం వద్ద పటిష్ట భద్రత కల్పించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని ఎస్పీ ఆదేశించారు. విధులకు కేటాయించిన పోలీసు సిబ్బంది సమయపాలన పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు తమ బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. అత్యవసర వైద్య సేవల కోసం రెండు అంబులెన్స్‌లను వైద్య సిబ్బందితో సిద్ధంగా ఉంచాలని, విద్యుత్, మున్సిపల్, అగ్నిమాపక, ఆర్అండ్‌బీ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.
అనంతరం కొడంగల్‌లోని బాసిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో పోలీసు సిబ్బందికి ఎస్పీ ప్రత్యేకంగా విధులపై అవగాహన కల్పించారు. కేటాయించిన బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డీఎస్పీ శ్రీనివాస్, ఇతర పోలీసు అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట





మొదటి పేజీ తరువాత..

అందిస్తున్న సహాయంపై మాట్లాడారు.

ప్రజలకు భరోసా.. నేరస్థులకు కఠిన చర్యలు..

ప్రజలు నిర్భయంగా జీవించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం అన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు, ఐటీ, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు పటిష్టంగా ఉండాలని పేర్కొన్నారు. పోలీసు శాఖలో హోంగార్డు నుంచి డీజీపీ వరకు సిబ్బంది పిల్లల విద్య కోసం రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో 44 ఎకరాల్లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించామని తెలిపారు.
"సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకంతో పోలీసుల వద్దకు వచ్చే సామాన్యులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలి. నేరస్థుల పట్ల కఠినంగా ఉండాలి. అమరుల కుటుంబాలు ఒంటరివి కావు. ప్రభుత్వం, పోలీసు శాఖ, సమాజం వారికి అండగా ఉంటాయి" అని సీఎం భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు.

2026లో మరో 5 వేల ఉద్యోగాలు..

పోలీసు శాఖలో ఇప్పటికే సుమారు 16 వేల మంది కానిస్టేబుళ్లు, ఎస్ఐలను నియమించామని సీఎం తెలిపారు. 2026లో మరో 5 వేల ఉద్యోగాల భర్తీకి అనుమతి ఇచ్చినట్లు వెల్లడించారు. విడతలవారీగా నియామకాలు చేపట్టి 2028 నాటికి అన్ని ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎన్నడూ లేని విధంగా 112 మంది డీఎస్పీలను నియమించామని పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించామని చెప్పారు.

అమరుల కుటుంబాలకు భారీ పరిహారం..

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అందించే పరిహారాన్ని ప్రభుత్వం గణనీయంగా పెంచిందని సీఎం వివరించారు. కానిస్టేబుళ్లకు గతంలో రూ.40 లక్షలుగా ఉన్న పరిహారాన్ని రూ.కోటికి పెంచినట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు రూ.కోటి, ఎస్ఐలు, ఇన్‌స్పెక్టర్లకు రూ.1.25 కోట్లు, డీఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులకు రూ.1.50 కోట్లు, ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రూ.2 కోట్లకు పరిహారాన్ని పెంచినట్లు వెల్లడించారు.
అమరుల కుటుంబాల్లో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం, ఉచిత విద్య, వైద్య సహాయం అందిస్తున్నామని చెప్పారు. భద్రతా సంక్షేమ నిధి నుంచి రూ.16 లక్షలు, సంక్షేమ నిధి నుంచి మరో రూ.8 లక్షలు అందించే నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. విధి నిర్వహణలో మరణించిన హోంగార్డుల కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ.5 లక్షల పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశించారు.

సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి..

మారుతున్న నేర స్వభావానికి అనుగుణంగా పోలీసు శాఖను ఆధునికంగా, సమర్థంగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఆహార కల్తీ వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డ్రగ్స్ నియంత్రణలో తెలంగాణ ఈగల్ ఫోర్స్ పనితీరును అభినందించారు. కల్తీ ఆహారాన్ని అరికట్టేందుకు టీజీ సేఫ్ వ్యవస్థను ప్రారంభించామని, మహిళల రక్షణకు షీ-టీమ్స్, 'స్టాండ్ విత్ హర్', స్పందన తక్షణ రక్షణ బృందాలు పనిచేస్తున్నాయని వివరించారు.

ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి తలెత్తకుండా

ముందస్తు చర్యలు



మొదటి పేజీ తరువాత..

నీటి సంరక్షణ పనులు చేపట్టాలని, కూలీల సంఖ్యను పెంచి అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచులు, గ్రామస్థులకు పిలుపునిచ్చారు. ఇప్పటి నుంచే నీటి నిల్వలను పెంచుకుంటే భవిష్యత్తులో నీటి ఎద్దడి తీవ్రతను తగ్గించవచ్చని అన్నారు.

తాగునీటికి అత్యంత ప్రాధాన్యం..

సాగునీటి అవసరాలతో పాటు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని సీతక్క స్పష్టం చేశారు. ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగించుకోవాలని, నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.
రామప్ప–లక్నవరం కాలువ వంటి ప్రతిపాదిత ప్రాజెక్టులతో పాటు ఇతర ప్రత్యామ్నాయ నీటి వనరులను అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తామని, నీటి సంరక్షణలో ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.



సిసి కెమెరాలకు సుస్తి

మొదటి పేజీ తరువాత..

వహిస్తున్నారా అనే సందేహం కలగడం సహజం.

మరమ్మతులు ఎందుకు చేయడం లేదు..?

సాంకేతిక లోపాలు వస్తే వెంటనే సరిచేయడానికి స్థానిక నిధులు లేదా ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నప్పటికీ, రోజులు గడుస్తున్నా పట్టించుకోకపోవడం కేవలం వ్యవస్థల అలసత్వాన్ని సూచిస్తుందనడంలో సందేహం లేదు.

జరగరానిది జరిగితే బాధ్యత ఎవరిది?

గతంలో తెలంగాణ వ్యాప్తంగా ముఖ్యంగా అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయం వంటి చోట్ల జరిగిన ఘోరమైన అగ్నిప్రమాదాలు,దాడుల సంఘటనలను అధికారులు మర్చిపోవడం విచారకరం.రేపు ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే,లేదా రికార్డులు మాయమైతే దానికి పూర్తి బాధ్యత అక్కడి ఉన్నతాధికారులదే అవుతుంది.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి తహసీల్దార్ కార్యాలయం నిరంతరం నిఘా నీడలోనే ఉండాలి.అంబర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో వెంటనే సిసి కెమెరాలను పునరుద్ధరించాలని,ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు ఆర్డీవో లేదా కలెక్టర్ తక్షణమే స్పందించి విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోశ్‌లకు ఊరట

ఇరువురి నేతల విడుదలకు హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకాకు ఊరట లభించింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అక్టోబర్ 13న జరిగిన నిరసనకు సంబంధించిన కేసులో వారిని విడుదల చేయాలని ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు బుధవారం ఆదేశించింది. ఇరువురి జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగియడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. వారి కస్టడీ గడువు ముగియడంతో ముందుగా సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాను పోలీసులు బుధవారం ఎస్ఈఎం ఎదుట హాజరుపరిచారు. విచారణ ప్రక్రియలో భాగంగా పూచీకత్తులను కూడా సమర్పించారు. అనంతరం వారిని విడుదల చేయాలని మేజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు.
జంతర్ మంతర్ వద్ద అక్టోబర్ 13న జరిగిన నిరసనల సందర్భంగా ఇరువురిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిషేధిత ప్రాంతం లేదా నిరసనలకు అనుమతి లేని ప్రదేశంలోకి ప్రవేశించారని, శాంతిభద్రతలను కాపాడతామని ఇచ్చిన పీస్ బాండ్ నిబంధనల్ని ఉల్లంఘించారన్న ఆరోపణలతో ఈ చర్యలు తీసుకున్నారు. అనంతరం వారిని అక్టోబర్ 14న మేజిస్ట్రేట్ 5 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించారు. అక్టోబర్ 19న గడువు ముగియడంతో కస్టడీని మరో రెండు రోజులు పొడిగించారు. ఈ గడువు బుధవారం ముగియడంతో విడుదల ఆదేశాలు వచ్చాయి. అప్పిలేట్ కోర్టును ఆశ్రయించవచ్చని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, బుధవారం ఉదయం ఈ కేసులో సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా జ్యుడీషియల్ కస్టడీ విషయంలో జోక్యం చేసుకోవడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. ముందుగా స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు నిర్ణయం కోసం వేచి చూడాలని సూచించింది. ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించకుండా నేరుగా హైకోర్టుకు ఎందుకు వచ్చారని ప్రశ్నించింది. మేజిస్ట్రేట్ నిర్ణయం తర్వాత కూడా వారికి ఏమైనా అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు ఏమైనా ఉంటే, సంబంధిత అప్పిలేట్ కోర్టును ఆశ్రయించొచ్చని హైకోర్టు పేర్కొంది.
విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టు ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఆందోళనలను కూడా ఉదాహరణగా ప్రస్తావించింది. పోలీసుల అనుమతి తీసుకోకుండా చేసే నిరసనల్ని ఏ మాత్రం సహించబోమని స్పష్టం చేసింది. నిరసన ప్రదేశాల జాబితా నుంచి జంతర్ మంతర్‌ను తొలగించిన తర్వాత కూడా అక్కడికి ఎందుకు వెళ్లారని పిటిషనర్లకు చీవాట్లు పెట్టింది.

ఢిల్లీలో మళ్లీ వాయు కాలుష్యం

అమల్లోకి వచ్చిన గ్రాప్ స్టేజ్ 1 ఆంక్షలు

వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ ప్రకటన

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం మరోసారి ఆందోళన కలిగిస్తోంది. గాలి నాణ్యత సూచీ (AQI) వేగంగా దిగజారడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కాలుష్య నియంత్రణ చర్యలను వేగవంతం చేసేందుకు ఢిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (GRAP) స్టేజ్–1 ఆంక్షలను తక్షణమే అమలు చేస్తున్నట్లు వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (CAQM) ప్రకటించింది. రానున్న రోజుల్లోనూ గాలి నాణ్యత ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.
ఒక్కరోజులోనే పెరిగిన కాలుష్యం
ఢిల్లీలో మొన్నటివరకు 'మోస్తరు' కేటగిరీలో ఉన్న వాయు నాణ్యత సూచీ, కేవలం 24 గంటల వ్యవధిలోనే గణనీయంగా పెరిగింది. అక్టోబర్ 20న 179గా నమోదైన AQI, అక్టోబర్ 21 మధ్యాహ్నం 2 గంటల సమయానికి 244కు చేరింది. దీంతో గాలి నాణ్యత ఒక్కసారిగా 'పూర్' (Poor) కేటగిరీలోకి పడిపోయింది. ఒక్కరోజులోనే కాలుష్య స్థాయిలు ఇంతలా పెరగడంపై భారత వాతావరణ విభాగం (IMD), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ (IITM) ఆందోళన వ్యక్తం చేశాయి. రానున్న రోజుల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగే ప్రమాదం ఉందని హెచ్చరించాయి.

అమల్లోకి వచ్చే ఆంక్షలు ఇవే:

జీఆర్‌ఏపీ (GRAP) మొదటి దశ అమలుతో ఎన్‌సీఆర్ పరిధిలో కింది నిబంధనలు కఠినంగా అమలు కానున్నాయి:
* బొగ్గు వినియోగంపై నిషేధం: హోటళ్లు, రెస్టారెంట్లు, ఓపెన్ ధాబాలలో బొగ్గు లేదా కట్టెలను ఇంధనంగా ఉపయోగించడాన్ని పూర్తిగా నిషేధించారు.
* నిర్మాణ రంగాలపై నిఘా: నిర్మాణ, కూల్చివేత ప్రాంతాల్లో ధూళి నివారణ చర్యలు చేపట్టాలి. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను తగులబెట్టడంపై నిషేధం విధించారు.
* యాంటీ స్మాగ్ గన్ల వినియోగం: రోడ్లపై ధూళి కాలుష్యాన్ని తగ్గించేందుకు మెకనైజ్డ్ పద్ధతిలో ఊడ్చడం, నీటిని చిలకరించడం (Water sprinkling) ముమ్మరం చేస్తారు.
* వాహన తనిఖీలు: కాలుష్య నియంత్రణ ధృవీకరణ పత్రం (PUC) లేని వాహనాలపై కఠిన చర్యలు ఉంటాయి.
పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, వాయు నాణ్యత మరింత దిగజారకుండా సంబంధిత ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేయాలని CAQM ఆదేశించింది. ప్రజలు కూడా కాలుష్య నివారణ మార్గదర్శకాలను పాటించి సహకరించాలని కోరింది.

ఈసీ స్వాతంత్ర్యాన్ని దెబ్బతీస్తున్న మోదీ ప్రభుత్వం

మల్లికార్జున ఖర్గే డిమాండ్

కర్నాటక : ఎన్నికల కమిషనర్లకు రక్షణ కల్పిస్తున్న 2023నాటి చట్టాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం ఈసీ స్వాతంత్ర్యానని దెబ్బతీస్తోందని ఆరోపించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలను తిరిగి ప్రవేశపెట్టాలని కోరారు. ఎన్నికల కమిషనర్లు రాజ్యాంగానికి అతీతులా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషనర్లను జవాబుదారీతనం నుంచి కాపాడుతోందని విమర్శించారు. కర్ణాటకలోని కలబురగిలో మీడియాతో ఆయన మాట్లాడారు.
"ఎన్నికలు నిష్పక్షపాతంగా, న్యాయంగా జరిగితే ఎవరైనా గెలవొచ్చు. కేవలం కాంగ్రెస్ మాత్రమే గెలవాలని గానీ, లేదా ఏదైనా ఒక ప్రత్యేక పార్టీ గెలవాలని గానీ రాజ్యాంగం చెప్పలేదు. ప్రతిపక్షం ఏ వ్యక్తి కోసమో లేదా పార్టీ కోసమో కాకుండా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, వ్యవస్థల సమగ్రతను కాపాడటానికి పోరాడుతోంది. ప్రతిపక్ష నాయకులు రాసిన లేఖలకు ప్రధాని మోదీ నేరుగా స్పందించకుండా, ఇతరుల ద్వారా సమాధానాలు ఇప్పిస్తున్నారు. కేంద్ర ఏకపక్షంగా వ్యవహరించాలని నిర్ణయించుకుంటే, ఈ దేశ ప్రజలు మౌనంగా ఉండరు. మోదీ ప్రభుత్వాన్ని అధికారం నుంచి గద్దె దించుతారు. ప్రభుత్వం తన తప్పులుగా సరిదిద్దుకోకపోతే ప్రజాగ్రహం ఎదుర్కోక తప్పదు." అని ఖర్గే మండిపడ్డారు.
అలాగే మహిళా రిజర్వేషన్ల అంశంపై ఖర్గే స్పందించారు. ప్రస్తుతం ఉన్న ఎంపీల సంఖ్యాబలంలోనే 33 శాతం మహిళా రిజర్వేషన్ల కోటాను ప్రభుత్వం అమలు చేయవచ్చని పేర్కొన్నారు. విపక్షాలు మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకమని చిత్రీకరిస్తూ మోదీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. తాము మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకమైతే, ఈ చట్టానికి మద్దతు ఇచ్చేవాళ్లమా? అని ప్రశ్నించారు.

రెండు రోజుల్లో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

మొదటి పేజీ తరువాత..

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థి ఎంపికపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదని తెలుస్తోంది. పీఆర్టీయూ అభ్యర్థి విషయంలోనూ పార్టీ నాయకత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సమాచారం. మరోవైపు, ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సామాజిక, రాజకీయ సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపికపై పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి.

ఆర్టీసీ గుర్తింపు సంఘంగా ఈయూ ఘన విజయం!

హైదరాబాద్, ప్రజా కలం : టీజీఎస్ఆర్టీసీ గుర్తింపు సంఘం ఈయూ ఘన విజయం సాధించింది. మొత్తం 18,276 ఓట్లు సాధించి రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘంగా ఎంపి కైంది. ఈ మేరకు కార్మిక శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ 13,556 ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఆర్టీసీ సంస్థవ్యాప్తంగా మొత్తం 34,904 ఓట్లకు గాను 34,421 ఓట్లు పోలయ్యాయి. అక్టోబర్ 9న రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించగా, అక్టోబర్ 14, 15 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలను ప్రకటించి, గుర్తింపు సంఘానికి సంబంధించిన ఉత్తర్వులను కార్మిక శాఖ విడుదల చేసింది. సికింద్రాబాద్, హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ రీజియన్లలో క్లాజ్–6 కింద టీఎంయూ (నిచ్చెన గుర్తు) మెజారిటీ సాధించింది. ఖమ్మం, నల్గొండ రీజియన్లలో టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆధిక్యం ప్రదర్శించింది. మెదక్, మహబూబ్‌నగర్, వరంగల్ రీజియన్లతో పాటు ప్రధాన కార్యాలయంలో వర్కర్స్ యూనియన్ ఆధిక్యం సాధించింది.

మద్యం అమ్మకాల్లో

తెలంగాణ రికార్డు !

మొదటి పేజీ తరువాత..

ఒక్కరోజే రూ.303 కోట్ల అమ్మకాలు!

అక్టోబర్ 19న మద్యం విక్రయాలు అత్యధికంగా నమోదయ్యాయి. ఆ ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. అక్టోబర్ 14న రూ.102.17 కోట్లు, 16న రూ.126.32 కోట్లు, 17న రూ.223.25 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. ఈ నాలుగు రోజుల్లో 6.83 లక్షల కేసుల హార్డ్ లిక్కర్, 10.44 లక్షల కేసుల బీరు అమ్ముడయ్యాయి.

అక్టోబర్‌లో ఇప్పటికే రూ.2,055 కోట్లు..

అక్టోబర్ 19 నాటికి నెల మొత్తం మద్యం విక్రయాల విలువ రూ.2,055 కోట్లకు చేరింది. సెప్టెంబర్‌లో రూ.3,209 కోట్లు, ఆగస్టులో రూ.3,482 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. దసరా పండుగ నేపథ్యంలో అక్టోబర్ నెల అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

2,620 దుకాణాల ద్వారా విక్రయాలు..

రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలు, సుమారు 1,200 బార్లు, రెస్టారెంట్లు, పబ్బులు, క్లబ్బుల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. మొత్తం 17 మద్యం డిపోల నుంచి సరఫరా కొనసాగుతోంది. ప్రభుత్వ ఆదాయంలో ఎక్సైజ్ శాఖ కీలక పాత్ర పోషిస్తుండగా, పండుగ వేళ పెరిగిన అమ్మకాలు ఆదాయాన్ని మరింత పెంచనున్నాయి.

పోలీస్ అమరవీరుల త్యాగాలు

చిరస్మరణీయం

టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



హైదరాబాద్ అక్టోబర్ 21(ప్రజా కలం) :

పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఘన నివాళులర్పించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, సమాజంలో శాంతి స్థాపన కోసం పోలీసులు చేస్తున్న సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం పోలీసులు నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్నారని, విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు భద్రత కల్పిస్తున్నారని తెలిపారు. దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, ధైర్యసాహసాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.
పోలీస్ అమరవీరుల కుటుంబాల త్యాగాలను సమాజం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని, వారి కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది సేవలను గౌరవించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరులందరికీ మరోసారి ఘన నివాళులర్పిస్తూ, వారి త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

టీఎంసీ ఎమ్మెల్యేల మద్దతు మాకే..

బెంగాల్ సీఎం సువేందు సంచలన వ్యాఖ్యలు

బలపరీక్ష పెడితే తమకు 275 మంది ఎమ్మెల్యేల మద్దతు

64 మంది ఎమ్మెల్యేలు బీజేపీకి మద్దతిస్తారని ధీమా




కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో రేపే బలపరీక్ష (ఫ్లోర్ టెస్ట్) నిర్వహించినా, తమ ప్రభుత్వానికి 275 మంది ఎమ్మెల్యేల మద్దతు లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) టికెట్‌పై గెలిచిన 64 మంది శాసనసభ్యులు కూడా తమకే మద్దతిస్తారని, దీంతో తమ సంఖ్య 275కి చేరుకుంటుందని బుధవారం స్పష్టం చేశారు.
కోల్‌కతాలోని చోర్‌బగాన్‌లో ఇటీవల దుర్గా పూజ మండపం వద్ద జరిగిన తొక్కిసలాటలో మరణించిన బాధితుడి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. "రేపు అసెంబ్లీలో బలపరీక్ష పెట్టమనండి. మా సంఖ్య 275కి చేరుకుంటుంది" అని అన్నారు. ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సోషల్ మీడియా లేదా టీవీ చర్చల ద్వారా రాలేదని, ప్రజల ప్రత్యక్ష మద్దతుతోనే సాధ్యమైందని నొక్కి చెప్పారు.
ఈ సందర్భంగా భవానీపూర్‌లో మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఓడించిన విషయాన్ని గుర్తు చేస్తూ తమది ప్రజలు ఎన్నుకున్న 'సనాతన' ప్రభుత్వమని సువేందు అధికారి అభివర్ణించారు. గత 49 ఏళ్లుగా వామపక్ష, టీఎంసీ పాలనలో పేరుకుపోయిన సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరిస్తోందని విమర్శించారు.
2026లో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 294 స్థానాలకు గాను, 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరదించుతూ బీజేపీ 208 సీట్లు గెలుచుకుని అధికారం చేపట్టింది. టీఎంసీ కేవలం 80 స్థానాలకే పరిమితమైంది. ఎన్నికల ఫలితాల అనంతరం టీఎంసీలో అంతర్గత విభేదాలు తలెత్తడం, పార్టీ గుర్తు కోసం ఓ వర్గం న్యాయపోరాటం చేస్తున్న నేపథ్యంలో సువేందు అధికారి వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ ప్రభుత్వం

- ప్రతిపక్షాలపై విషప్రచారం.. ప్రజా సమస్యలు గాలికి..
- ప్రజాతంత్ర, లౌకిక శక్తులన్నీ ఏకమై రాజ్యాంగాన్ని కాపాడాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ

ప్రజాకలం, హైదరాబాద్:

ప్రజా సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు, విద్యార్థులు, యువకులు పోరాడుతుంటే వాటిని పరిష్కరించకుండా ప్రతిపక్షాలపై ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ విషప్రచారం చేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ విమర్శించారు. విజయదశమి వేడుకల సందర్భంగా వేర్వేరు ప్రాంతాల్లో వారు చేసిన వ్యాఖ్యలు ప్రజా ఉద్యమాలను కించపరిచేలా ఉన్నాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారంతా విదేశీ శక్తుల మద్దతుతో ఉద్యమాలు చేస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కోట్లాది మంది ఓటర్ల పేర్ల తొలగింపుతో ప్రజలకు జరిగిన అన్యాయానికి బాధ్యత వహించాల్సిన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తే దానిని కూడా తప్పుబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
ప్రధాని మోదీ వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని, లౌకికవాదానికి తూట్లు పొడుస్తున్నారని రామకృష్ణ ఆరోపించారు. లౌకికవాదం గురించి మాట్లాడటమే తప్పన్నట్లుగా ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. మత ప్రాతిపదికన సమాజాన్ని విభజిస్తున్నది బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లేనని, మైనారిటీలకు వ్యతిరేకంగా మెజారిటీ హిందువులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందుతున్నాయని విమర్శించారు. దీనికి విరుద్ధంగా ప్రతిపక్షాలే సమాజాన్ని చీలుస్తున్నాయంటూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.
బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనారిటీలపై దాడులు పెరిగాయని, వారిని రెండో తరగతి పౌరులుగా చూస్తూ పాలనలో తగిన భాగస్వామ్యం కల్పించడం లేదని ఆరోపించారు. 'విభజించి పాలించు' విధానంతో అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నవారే ఇతరులకు నీతులు చెబుతున్నారని విమర్శించారు.
గత 12 ఏళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని రామకృష్ణ ఆరోపించారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్నీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, వ్యవస్థలను తమ ఆధీనంలోకి తెచ్చుకుని అవినీతిని ప్రోత్సహిస్తూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న ఈ ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదని, తక్షణమే దిగిపోవాలని డిమాండ్ చేశారు.
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటే ప్రజలంతా ఐక్యంగా ముందుకు రావాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య, లౌకిక శక్తులన్నీ ఏకమై ప్రజా హక్కుల పరిరక్షణ కోసం జరిగే పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు.



ప్రజా కలం

సంపాదకీయం

మాదకద్రవ్యాలపై సమరమే శరణ్యం

దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో తయారవుతుంది. యువత చేతుల్లోని నైపుణ్యాలు, వారి ఆలోచనలు, ఆశయాలే రేపటి భారతాన్ని తీర్చిదిద్దుతాయి. అలాంటి యువశక్తిని మాదకద్రవ్యాల మాయాజాలం క్రమంగా నిర్వీర్యం చేస్తే అంతకంటే ప్రమాదకరమైన పరిణామం మరొకటి ఉండదు. మత్తు ఒక్క వ్యక్తిని మాత్రమే దెబ్బతీయదు. కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేస్తుంది. సమాజంపై భారం మోపుతుంది. దేశ ఉత్పాదకతను దెబ్బతీస్తుంది. అందుకే మాదకద్రవ్యాల నిర్మూలనను సాధారణ నేర నియంత్రణ అంశంగా చూడటం సరికాదు. ఇది జాతీయ ప్రాధాన్య అంశం.

మాదకద్రవ్యాల వినియోగంపై అందుబాటులో ఉన్న అధికారిక అంచనాలు పరిస్థితి తీవ్రతను చాటుతున్నాయి. దేశవ్యాప్తంగా కోట్లాది మంది గంజాయి, ఓపియాయిడ్ తదితర మాదక పదార్థాల వినియోగానికి గురవుతున్నట్లు జాతీయ స్థాయి అధ్యయనాలు వెల్లడించాయి. ముఖ్యంగా ఓపియాయిడ్ వినియోగంతో సమస్యలు ఎదుర్కొంటున్న లక్షలాది మందికి చికిత్స, పునరావాస సేవలు అవసరమని గుర్తించారు. అయితే ఈ గణాంకాలు కొన్నేళ్ల క్రితం నాటివి కావడం గమనార్హం. పరిస్థితి ఏ స్థాయిలో మారిందో తెలుసుకోవడానికి తాజా జాతీయ సర్వేను నిర్వహించాల్సిన అవసరం ఉంది.

పెరుగుతున్న అక్రమ రవాణా..

మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్ ఎంత విస్తరించిందో భారీగా జరుగుతున్న స్వాధీనాలు స్పష్టం చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా వేల కోట్ల రూపాయల విలువైన డ్రగ్స్ పట్టుబడుతున్నాయి. ఒకవైపు భారీగా మాదక పదార్థాలు స్వాధీనం అవుతుండటం నిఘా వ్యవస్థ చురుకుదనానికి సంకేతమే అయినా.. మరోవైపు ఇంత పెద్ద మొత్తంలో అక్రమ సరుకు దేశంలోకి ఎలా చేరుతోంది? దాని వెనుక ఉన్న వ్యవస్థ ఎంత బలంగా ఉంది? అన్న ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి.

సరిహద్దుల నుంచి నగరాల వరకు విస్తరించిన సరఫరా గొలుసును తెగదెంపులు చేయాలి. డ్రగ్స్ వ్యాపారం వెనుక ఉన్న ఆర్థిక లావాదేవీలను గుర్తించి మూలాలను ఛేదించాలి. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ వేదికలను ఉపయోగించుకుంటున్న అక్రమ విక్రయాలపై సాంకేతిక నిఘాను మరింత పటిష్ఠం చేయాలి.

అవగాహనతోనే అడ్డుకట్ట..

మాదకద్రవ్యాలపై పోరాటం పోలీసుల బాధ్యతతోనే ముగియకూడదు. పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు మత్తు పదార్థాల దుష్పరిణామాలపై శాస్త్రీయ అవగాహన కల్పించాలి. కళాశాలల్లో కౌన్సెలింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. విద్యార్థులు భయపడకుండా తమ సమస్యలను చెప్పుకోగలిగే వాతావరణం కల్పించాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించాలి.

అంతేకాదు.. మాదకద్రవ్యాలకు బానిసైన ప్రతి ఒక్కరినీ నేరస్థుడిగా చూడటం వల్ల సమస్య మరింత జటిలమయ్యే ప్రమాదం ఉంది. వ్యసనం నుంచి బయటపడేందుకు వైద్య చికిత్స, మానసిక సహాయం, పునరావాసం అందించాలి. తిరిగి సాధారణ జీవితంలోకి అడుగుపెట్టేలా ఉపాధి, కుటుంబ సహకారం కల్పించాలి. నేరానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పనిసరే అయినా.. వ్యసన బాధితులకు చికిత్స అందించడమూ అంతే ముఖ్యం.

నినాదం కాదు.. ఉద్యమం..

'నషా ముక్త్ భారత్' వంటి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా అవగాహన పెంచుతున్నాయి. కోట్లాది మందికి చేరువవుతున్న ఈ కార్యక్రమాల ద్వారా యువతలో చైతన్యం తీసుకురావడం స్వాగతించదగ్గ పరిణామం. వ్యసన విముక్తి కేంద్రాల సంఖ్య పెరగడం కూడా అవసరమైన ముందడుగే. అయితే కార్యక్రమాల విజయాన్ని కేవలం నిర్వహించిన సభలు, చేసిన ప్రచారాలు, చేరుకున్న ప్రజల సంఖ్యతో కొలవడం సరిపోదు. ఎంతమంది మత్తు నుంచి బయటపడ్డారు? ఎంతమందిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురాగలిగాం? ఎంతమంది యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా నిలువరించగలిగాం? అన్నదే అసలు కొలమానం కావాలి.

మాదకద్రవ్యాలపై పోరాటంలో ప్రభుత్వం–పోలీసులు–వైద్యులు–విద్యాసంస్థలు–తల్లిదండ్రులు–స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలి. సరఫరాను అడ్డుకోవడంతో పాటు డిమాండ్‌ను తగ్గించేందుకు నిరంతర చర్యలు అవసరం. ప్రతి గ్రామం, ప్రతి పాఠశాల, ప్రతి కళాశాల, ప్రతి కుటుంబం ఈ పోరాటంలో భాగస్వామి కావాలి.

యువతకు మత్తు అందించే చేతులు బలపడితే దేశ భవిష్యత్తు బలహీనమవుతుంది. అదే యువత చేతిలో పుస్తకం, నైపుణ్యం, ఉద్యోగం, లక్ష్యం ఉంటే దేశం అభివృద్ధి పథంలో మరింత వేగంగా దూసుకుపోతుంది. అందుకే మాదక రహిత భారత్ అనేది కేవలం ప్రభుత్వ నినాదంగా కాకుండా.. సమాజం మొత్తం స్వీకరించాల్సిన సంకల్పంగా మారాలి.

రచనలు పంపండి

ప్రజాకలం 'అభిప్రాయం' పేజీకి సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదకీయ లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్‌కు పంపించాలని మనవి.

prajakalam2010@gmail.com
website : www.prajakalam.com
Editor : +919010972526
Office : 1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, Hyd.

చరిత్రలో నేడు..

1781
అమెరికా స్వాతంత్ర్య సంగ్రామంలో భాగంగా వర్జీనియాలోని యార్క్‌టౌన్‌లో బ్రిటీష్ జనరల్ లార్డ్ కార్న్‌వాలిస్ అమెరికన్, ఫ్రెంచ్ సంయుక్త సైన్యాలకు లొంగిపోయాడు.

1943
క్షయ (TB) వ్యాధికి మొట్టమొదటి విప్లవాత్మక యాంటీబయాటిక్ 'స్ట్రెప్టోమైసిన్'ను రూట్జర్స్ విశ్వవిద్యాలయంలోని పరిశోధకులు కనుగొన్నారు.

1954
1954 – హిమాలయాల్లోని ఎవరెస్ట్ ప్రాంతంలో ఆరో అత్యున్నత శిఖరమైన 'చో యు' (Cho Oyu)ను నేపాల్‌కు చెందిన పాసాంగ్ దావా లామా, ఆస్ట్రియాకు చెందిన జోసెఫ్ జోచ్లర్, హెర్బర్ట్ టిచి మొదటిసారిగా అధిరోహించారు.



శ్రీ రాముని దయచేతను
నారూఢిగ సకల జనులు నౌరా యనగా
ధారాళమైన నీతులు
నోరూరగ జవులు పుట్ట నుడివెద సుమతీ

భావం : మంచి బుద్ధిగలవాడా! శ్రీ రాముని యొక్క దయవలన నిశ్చయముగా అందరు జనులను ఔరా అనునట్లుగా నోటినుండి నీళ్ళూరునట్లుగా రసములు పుట్టగా న్యాయమును భోధించు నీతులను చెప్పెదన్.

కేసీఆర్‌కు దసరా శుభాకాంక్షలు తెలిపిన

వంటేరు ప్రతాప్‌రెడ్డి

ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను కలిసిన గజ్వేల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి

గజ్వేల్ ,21 అక్టోబర్ 2026 (ప్రజా కలం ప్రతినిధి) :



దసరా పండుగను పురస్కరించుకుని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి,బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్)ను గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.గజ్వేల్ నియోజకవర్గం మార్కుక్ మండలంలోని ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఆయనను కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అభివృద్ధి,సంక్షేమ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని కొనియాడారు.దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు,విజయాలు నింపాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజలంతా సంతోషంగా,సుభిక్షంగా ఉండాలని పండుగ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.

సబితా ఇంద్రారెడ్డికి దసరా శుభాకాంక్షలు

తుక్కుగూడ బిఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ సామెల్ రాజు



మహేశ్వరం , అక్టోబర్ 21, (ప్రజా కలం) :

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని తుక్కుగూడ మున్సిపాలిటీ యూత్ ప్రెసిడెంట్ రాజు, మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి ని కార్తీక్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అయిన ఈ విజయదశమి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.ప్రతి ఒక్కరి జీవితంలో ఈ పండుగ నూతన విజయాలకు నాంది పలకాలని కోరారు.

తుల్జా భవానీ ఆలయాన్ని సందర్శించిన

కందుకూరు సీఐ వెంకటేశ్వర్లు



కందుకూరు, అక్టోబర్ 21, (ప్రజా కలం) : కందుకూరు మండలం గుమ్మడవెల్లి తండాలో కొలువైన శ్రీ తుల్జా భవానీ దేవాలయాన్ని కందుకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు సందర్శించారు.ఈ సందర్భంగా 9వ వార్డు సభ్యులు సభావాట్ మోతిలాల్ ఆధ్వర్యంలో సీఐ సత్యనారాయణ ని ఆలయ కమిటీ శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి జగ్గు నాయక్, గ్రామ పెద్దలు విజయ్, నరేష్, సక్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

దుర్గా మాత నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన కాంటేకార్ మధుమోహన్

మహేశ్వరం అక్టోబర్ 21 (ప్రజా కలం) :



జిహెచ్ఎంసి అధికారులతో మాట్లాడి దుర్గా మాత నిమజ్జనం ఏర్పాట్ల కోసం మాట్లాడిన తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ తుక్కుగూడ సూరం చెరువు రావిరాల పెద్ద చెరువు వద్ద క్రేన్ల ఏర్పాటు అమ్మవారి శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంలో నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి శంషాబాద్ జిహెచ్ఎంసి 66 డివిజన్ రావిరాలలో నవరాత్రులు పూజలు అందుకున్న దుర్గామాతని ఈరోజు రావిరాల పెద్ద చెరువులో నిమజ్జనం చేస్తారు అందుకు సంబంధించినటువంటి ఏర్పాట్లును తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్ పరిశీలించారు.

అక్రమ నిర్మాణాలపై సర్కారు బ్రహ్మాస్త్రం

క్రయవిక్రయాలకు చెక్..
'క్యూర్' చట్టంలో కలిన నిబంధనలు
అనుమతి లేని, అదనపు అంతస్తుల రిజిస్ట్రేషన్లపై ఆంక్షలు
ఆస్తుల విక్రయం, బహుమతి, లీజు, తనఖా తదితర బదలాయింపులపై నిషేధం

హైదరాబాద్, అక్టోబరు 21(ప్రజాకలం) :

హైదరాబాద్ మహానగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు కళ్లెం వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. రెండు అంతస్తులకు అనుమతి తీసుకుని ఐదు అంతస్తులు నిర్మించడం.. ఆ తర్వాత వాటిని అమాయక కొనుగోలుదారులకు విక్రయించి సొమ్ము చేసుకోవడం.. కాలక్రమంలో క్రమబద్ధీకరణ (రెగ్యులరైజేషన్) కోసం ప్రయత్నించడం.. ఇలా దశాబ్దాలుగా సాగుతున్న అక్రమ నిర్మాణాల దందాకు శాశ్వతంగా అడ్డుకట్ట వేసేలా 'క్యూర్' కొత్త చట్టంలో కఠిన నిబంధనలు పొందుపరిచినట్లు తెలుస్తోంది. ప్రత్యేకించి అక్రమ నిర్మాణాలపై ఆస్తుల బదలాయింపునకు అవకాశం లేకుండా 'సెక్షన్ 168'ను అత్యంత కఠినంగా రూపొందించినట్లు సమాచారం. అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు, మంజూరైన ప్లాన్‌కు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించిన ఆస్తుల విక్రయాలు, రిజిస్ట్రేషన్లను నిరోధించడమే ఈ నిబంధనల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.

సెక్షన్ 168 ఏం చెబుతోంది?

మున్సిపాలిటీ, నగరపాలక సంస్థ, హెచ్ఎండీఏ తదితర సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి నిర్మాణ అనుమతి లేకుండా భవనం నిర్మించినా.. లేదా అనుమతించిన ప్లాన్, నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించినా.. దాన్ని చట్టపరంగా 'అక్రమ నిర్మాణం'గానే పరిగణిస్తారు. అలాంటి నిర్మాణాన్ని గుర్తించిన తర్వాత ఆ భవనంపై యజమానికి ఉన్న హక్కులపై చట్టపరమైన ఆంక్షలు విధించేలా నిబంధనలు రూపొందించినట్లు తెలుస్తోంది.

క్రయవిక్రయాలకు కళ్లెం..

అక్రమ నిర్మాణాలు చేసి వాటిని విక్రయించడం ద్వారా లాభాలు ఆర్జించే రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయడమే సెక్షన్ 168(3) ప్రధాన ఉద్దేశంగా భావిస్తున్నారు. ఈ నిబంధనల ప్రకారం అక్రమ నిర్మాణంగా గుర్తించిన ఆస్తిని విక్రయించడం, కొనుగోలు చేయడం, బహుమతిగా ఇవ్వడం, లీజుకు ఇవ్వడం, తనఖా పెట్టడం, ఆస్తి మార్పిడి చేయడం వంటి బదలాయింపులకు అవకాశం ఉండదు. దీంతో అక్రమ నిర్మాణాలపై ఆధారపడిన లావాదేవీలకు చట్టపరంగా బ్రేకులు పడనున్నాయి.

ఉల్లంఘిస్తే రిజిస్ట్రేషన్ చెల్లదు..

చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా అక్రమ నిర్మాణానికి సంబంధించిన ఆస్తిని బదలాయించినా.. కొనుగోలు చేసినా.. ఆ లావాదేవీకి చట్టపరమైన గుర్తింపు ఉండదు. అలాంటి రిజిస్ట్రేషన్లు చెల్లుబాటు కానివిగా పరిగణించేలా నిబంధనలు పొందుపరిచినట్లు తెలుస్తోంది. అక్రమ ఆస్తుల బదలాయింపును 'రాష్ట్ర చట్టం ద్వారా నిషేధించబడిన స్థిరాస్తి బదలాయింపు'గా పరిగణించేలా సెక్షన్ 168(4)లో నిబంధనలను రూపొందించినట్లు సమాచారం. ఫలితంగా రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22-ఏ(1)(ఏ) కింద అలాంటి ఆస్తుల రిజిస్ట్రేషన్లను నిరోధించే అవకాశం ఉంటుంది. దీంతో ఆయా ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చిన తర్వాత మళ్లీ ఇతరుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయడం సాధ్యం కాదు.

కొత్తవే కాదు.. పాత నిర్మాణాలపైనా కొరడా..

'క్యూర్' చట్టం కొత్తగా చేపట్టే నిర్మాణాలకే వర్తిస్తుందని భావిస్తే పొరపాటే. చట్టం అమల్లోకి వచ్చేనాటికి పూర్తికాని అక్రమ నిర్మాణాలకూ ఇది వర్తించేలా నిబంధనలు రూపొందించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా పాత భవనంపై చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత అనుమతి లేకుండా అదనపు అంతస్తులు నిర్మిస్తే.. పాత, కొత్త నిర్మాణం మొత్తాన్ని అక్రమ నిర్మాణంగా పరిగణించేలా నిబంధనలు ఉండనున్నట్లు సమాచారం. అంటే.. ఇప్పటికే ఉన్న భవనంపై అనుమతి లేకుండా అదనపు నిర్మాణం చేపడితే దాని ప్రభావం మొత్తం భవనంపైనే పడే అవకాశం ఉంటుంది.

అక్రమంగా అదనపు అంతస్తులు నిర్మించి.. అనంతరం వాటిని విక్రయించడం లేదా ఇతర రూపాల్లో బదలాయించడం ద్వారా చట్టబద్ధత పొందే మార్గాలను మూసివేయడమే దీని ఉద్దేశం. అమ్ముకునే అవకాశం లేకపోతే అక్రమ నిర్మాణాలకు సహజంగానే అడ్డుకట్ట పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.



కొనుగోలుదారులపై పెరగనున్న బాధ్యత..

కొత్త చట్టం అమల్లోకి వస్తే ఆస్తులు కొనుగోలు చేసేవారి బాధ్యత కూడా పెరగనుంది. భవనం కొనుగోలు చేసే ముందు నిర్మాణ అనుమతి ఉందా? మంజూరైన ప్లాన్ ప్రకారమే నిర్మించారా? అదనపు అంతస్తులకు అనుమతి ఉందా? ఆ ఆస్తి 22-ఏ నిషేధిత జాబితాలో ఉందా? వంటి అంశాలను కొనుగోలుదారులు పరిశీలించాల్సి ఉంటుంది. కేవలం విక్రేత చెప్పిన మాటలను నమ్మి ఆస్తులు కొనుగోలు చేస్తే తర్వాత న్యాయపరమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది.

అమలే అసలు సవాల్ ..

అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు ఎన్ని చట్టాలు వచ్చినా.. వాటి అమలులో లోపాలు ఉంటే ఆశించిన ఫలితం దక్కదు. కొత్తగా తీసుకురానున్న 'క్యూర్' చట్టాన్ని అధికారులు ఎంత పారదర్శకంగా అమలు చేస్తారన్నదే కీలకం. అక్రమ నిర్మాణాలను గుర్తించే దశ నుంచి రిజిస్ట్రేషన్లను నిరోధించే వరకు కింది స్థాయి సిబ్బంది చేతివాటానికి అవకాశం లేకుండా పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. నిబంధనల అమలులో రాజకీయ, అధికార ఒత్తిళ్లకు తావులేకుండా చర్యలు తీసుకుంటేనే చట్టం లక్ష్యం నెరవేరుతుంది. అక్రమ నిర్మాణాలకు చట్టపరంగా అమ్మకపు మార్గాన్ని మూసివేయడమే ఈ సంస్కరణలో కీలకమైన అంశంగా మారనుంది.

మీర్‌పేట్‌లో అమ్మవారికి మల్కాజిగిరి ఎంపీ ఈటల ప్రత్యేక పూజలు



మహేశ్వరం, అక్టోబర్ 21, (ప్రజా కలం) :

రాష్ట్ర బిజెపి నేత కోలన్ శంకర్ రెడ్డి ఆహ్వానం మేరకు మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ విజయ దశమి రోజున మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మీర్‌పేట్ 60 వ డివిజన్ లోని దాతు నగర్, తిరుమల్ నగర్, సాయిగణేష్ నగర్ లలో పర్యటించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తిరుమల నగర్ లో వెంకటేశ్వర శివాలయంలో దేవలయములో పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు యాదగిరి రెడ్డి, కోడూరి సోమేశ్వర్, జయకాంత, సత్య ప్రకాష్, గంగారాం సురేష్, త్రినత్, శ్రీనివాస్ రెడ్డి, జే. దామోదర్ రెడ్డి, ఎడ్ల మల్లేష్, ప్రవీణ్, జైస్వాల్, మనోజ్, నర్సింహ యాదవ్, శ్యామ్, కాసప్ప, రామకృష్ణ, రమణ, సత్యం రాజు, మహేష్, గిరి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

సీఐ రాఘవేందర్‌రెడ్డి కి దసరా శుభాకాంక్షలు

మహేశ్వరం మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు నేనావత్ రాజు నాయక్



మహేశ్వరం, అక్టోబర్ 21, (ప్రజా కలం) :

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మహేశ్వరం సీఐ రాఘవేందర్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు దసరా శుభాకాంక్షలు తెలిపారు.అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ ఆ యురారోగ్యాల తో, సుఖ స ంతోషాల తో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహేశ్వరం మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నేనావత్ రాజు నాయక్, మహేశ్వరం మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్, శ్రీ రాజరాజేశ్వరి ఆలయ టెంపుల్ చైర్మన్ అల్లే కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లే భిక్షపతి, ఉప్పుగడ్డ ఉప సర్పంచ్ మోహన్ నాయక్, వార్డు సభ్యుడు శివ నాయక్, హాజీ బాబా, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు దసరా శుభాకాంక్షలు

మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 21, (ప్రజా కలం) :

విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకుని మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు, గ్రామస్తులకు మాజీ ఎమ్మెల్యే, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణా రెడ్డి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన తన స్వగ్రామంలోని బురుజు వద్ద అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, జెండాను ఆవిష్కరించారు. అనంతరం మీర్‌పేట్‌లోని ప్రసిద్ధ శ్రీ నర్మదా కాశీ విశ్వనాథ ఆలయంలో జరిగిన రావణ సంవరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ తీగల విక్రమ్ రెడ్డి, తీగల నితీష్ రెడ్డి, దినేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ పాండు గౌడ్, తీగల సాయి రెడ్డి తదితర ప్రజా ప్రతినిధులు, నాయకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు

దేశ చరిత్రలో చిరస్మరణీయం

కందుకూరు ఎస్‌హెచ్‌ఓ హెచ్. వెంకటేశ్వర్లు

మహేశ్వరం, అక్టోబర్ 21, (ప్రజా కలం) :



త్యాగానికి ప్రతిరూపం పోలీసు.. సేవకు నిలువెత్తు నిదర్శనం పోలీసు.. ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమించే రక్షణ కవచం పోలీసు! సమాజంలో శాంతిభద్రతలను కాపాడుతూ, ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పిస్తూ, నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్న పోలీసు వ్యవస్థ సేవలు వెలకట్టలేనివని రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ హెచ్. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వారి త్యాగాలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని, వారి స్ఫూర్తితో ప్రస్తుత పోలీసు సిబ్బంది ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తున్నారని పేర్కొన్నారు.పోలీసు అమరవీరుల దినోత్సవం అనేది కేవలం ఒక స్మరణ దినం మాత్రమే కాదని, దేశ భద్రత కోసం ప్రాణాలను అర్పించిన వీరుల త్యాగాలను గుర్తుచేసుకునే పవిత్ర సందర్భమని ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఎన్నో సవాళ్లను, ప్రమాదాలను ఎదుర్కొంటూ పోలీసులు ప్రజల రక్షణ కోసం నిరంతరం పనిచేస్తుంటారని పేర్కొన్నారు. నేరస్థులను ఎదుర్కోవడం, ప్రమాదకర పరిస్థితుల్లో ప్రజలను కాపాడటం, విపత్తుల సమయంలో బాధితులకు అండగా నిలవడం వంటి అనేక బాధ్యతలను పోలీసులు నిర్వర్తిస్తున్నారని వివరించారు.ప్రజల ప్రాణాలను కాపాడే క్రమంలో కొందరు పోలీసులు తమ ప్రాణాలను కోల్పోవడం అత్యంత బాధాకరమైన విషయమని, అలాంటి అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరిచిపోలేమని అన్నారు. వారి కుటుంబాలు అనుభవించే బాధను సమాజం అర్థం చేసుకోవాలని, అమరవీరుల కుటుంబాల పట్ల గౌరవభావంతో వ్యవహరించాలని సూచించారు. పోలీసు అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు న్యాయం జరిగేలా, సమాజంలో భద్రతా భావం పెంపొందేలా పనిచేయడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.